# చుట్టం

చిరుద్యోగి సుబ్బారావు భార్య, ముగ్గురు పిల్లల్తో వైజాగ్‌లో తనకొచ్చే జీతంతో అతి జాగ్రత్తగా నెట్టుకొస్తున్నాడు. అప్పుడప్పుడూ చుట్టాల తాకిడి కష్టమైనా తప్పటం లేదు.

ఒకసారి భార్యకి దూరపు చుట్టం, వరసకు అన్నయ్య అయిన గోపాలం వచ్చాడు. భార్య అతని రాకకి తెగ సంబరపడిపోయి,



రాకరాక వచ్చినందుకు అడుగులకు మడుగులు వత్తుతోంది. అతడు రెండు మూడు రోజులయినా కదలటంలేదు. సరిగదా మాటవరసకు వెళ్తానన్నా 'రేపెళ్దువుగానిలే, ఎల్లుండి వెళ్దువుగానిలే' అని భార్య అతని ప్రయత్నాన్ని విరమింపచేస్తోంది. అతడూ ఉద్యోగస్తుడు కాకపోవటం చేతా, కొంచెం సోమరికాపటం చేతా మరి కదలటం లేదు.

అసలే వేసవికాలం కుళాయిలు సరిగా రావటంలేదు. స్నానానికి ఇబ్బందిగా ఉంది.... రెండే గదులు అవటంవల్ల పడుకోడానికీ ఇబ్బందిగానే ఉంది. పైగా గదిలో ఉన్న ఒకే ఫ్యాను కింద అతను మంచం వేసుకుని పడుకుంటున్నాడు. అతన్ని పొమ్మని ఎలా చెప్పాలో సుబ్బారావుకి తెలీటంలేదు. భార్యని చెప్పమంటే ఏం బాగుంటుంది? రాకరాక వచ్చాడు? అంటోంది.

సుబ్బారావు ఆరోజు ఆఫీసులో ఉండగా అతని చెవిలో ఎనౌన్సుమెంటు పడింది. 'రెండు రోజులు మాత్రమే! దిగ్రేట్ జెమినీ సర్కస్! అత్యద్భుత ప్రదర్శనతో మీ కళ్ళకు విందు చేసే సర్కస్ మరో రెండు రోజులు మాత్రమే! త్వరపడండి'' అని! సుబ్బారావు ఎగిరి గంతేశాడు.

ఇంటికి వెళ్ళేక పిల్లల్ని పిల్చి చెవిలో రహస్యంగా ఏదో చెప్పాడు

రోజూలాగే ఆ చుట్టం గోపాలం 'బావా నేనెళ్తాను' అని తయారయాడు. "వెళ్దూగానిలే, ఇంటికెళ్ళి ఏంచెయ్యాలి? వచ్చిన దగ్గర్నుంచీ వెళిపోతానని ఒకటే గోల. అయినా అంతమొహమాటం దేనికి? నేనేం పైదాన్నా అదే నీ సొంత చెల్లెలయితే ఇలానే మొహమాట పడతావా?" అంది సుబ్బారావు భార్య, గొప్ప కోపం వచ్చింది సుబ్బారావుకు. గోపాలం ఈలోగా మళ్ళీ బేగ్‌ని దించేసాడు.

ఇంతలో పిల్లలు గుమిగూడారు. "మామయ్యా! నువ్వెళ్ళకూడదు. ఇక్కడే ఉండిపోవాలి" మారాం చేయసాగారు.

"సరే లెండర్రా, అలాగే కానీండర్రా!" అన్నాడు.

"మామయ్యా! జెమినీ సర్కస్ వచ్చింది. రెండు రోజులే ఉంటుందిట. నాన్నని తీసుకెళ్ళమంటే డబ్బుల్లేవని కసురుతున్నారు. నువ్వు తీసుకెళ్ళు మామయ్యా!" అన్నారు.

"పోనీ తీసుకెళ్ళవోయ్ మీ చెల్లెలికీ సర్కస్ అంటే సరదాయే. టికెట్టు ఇరవై రూపాయలే" అన్నాడు సుబ్బారావు.

గోపాలం గుడ్లు తేలేశాడు. మొత్తం ఆరు టికెట్లు నూటిరవయ్యి. ఆటోఛార్జీలు. ఇంకా పై ఖర్చులు. నూటయాభై దాటుతుంది. మనసులోనే లెక్కేసుకొని నీళ్లునమిలాడు.

ఆ తరువాత బేగ్ సర్దుకుని, 'చెల్లాయ్.... నేను అసలు సంగతి మరిచేపోయాను, మొన్నటికే ఇంటికి వచ్చేస్తానన్నాను. నేను లేకపోతే చంటాడు వాళ్ళమ్మని కాల్చుకుతింటాడు, నేనర్జంటుగా వెళ్ళాలి" అని చెల్లెలు ఎంత ఉండమన్నా ఉండక ఇంట్లోంచి పరుగు తీసాడు.

"పాపం! చంటాడంటే ఎంత ప్రేమా!" అంటూ నవ్వుకున్నాడు సుబ్బారావు.